క్లుప్తంగా

నృసింహుని మాల ధారులకు దుస్తులు అందజేత



మంగళగిరి: స్థానిక శ్రీపానకాల లక్ష్మీ నృసింహ స్వామి మాల ధారణ భక్తులకు నగరానికి చెందిన తోట శ్రీనివాస్ నూతన వస్త్రాలను అందజేశారు. 16 సంవత్సరాలుగా నృసింహుని మాల ధారణ భక్తులకు వస్త్రాలను అందజేస్తున్న ఆయన బుధవారం నృసింహుని అర్ధ మండల దీక్షా పరులకు నూతన వస్త్రాలను అందజేయగా గురుస్వామి మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు మాల ధారణ చేశారు. కార్యక్రమంలో తోట సాంబ, చింకా మహేష్, రుద్రు వినయ్, చింకా లవణ్ కృష్ణ, చిన్న వెంకట శేషు, యర్రాకుల సురేష్ పాల్గొన్నారు.

బీసీ జనభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మంగళగిరి: బీసీ జనభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నగరంలోని బీసీ సేన కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోలి నాగకుమార్ మాట్లాడుతూ బీసీ హక్కుల సాధన కోసం ఈనెల 22వ తేదీన నియోజకవర్గ బీసీ సేన ఆధ్వర్యంలో నగరంలోని ఈద్గా ఫంక్షన్‌హాల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా బీసీ సేన జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు శౌంరి నాగరాజు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పరసా రంగనాథ్, మీనిగ ఆంజనేయులు, కుంచాల కిషోర్, సాధు వేణుగోపాల్, కుర్నెళ్ల వెంకట కోటేశ్వరరావు, నక్కా దుర్గా మహేష్, కుంచాల శ్రీను, తాడిమల వేణు, గండికోట వెంకయ్య పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

అడిషనల్ కమిషనర్ హేమమాలిని



మంగళగిరి: ఓటరు కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని అడిషనల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. నగరంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులకు అందుబాటులో ఉండేందుకు ఈ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా ఆధార్ లింకు చేయించుకోని వారు ఎవరైనా ఉంటే ఆందోళన చెందాల్సిన పని లేదని, సంబంధిత పోలింగ్ స్టేషన్, సచివాలయంలో సంప్రదించి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవచ్చునన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు.

ఎస్టీయూ ప్యాకెట్ బుక్ ఆవిష్కరణ



ఫిరంగిపురం: మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్యాకెట్ బుక్‌ను ఎంఈఓ సాల్మన్‌రాజు బుధవారం ఆవిష్కరించారు. ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. ప్యాకెట్ బుక్ ఉపాధ్యాయులకు ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోసఫ్‌సుధీర్‌బాబు, జోజప్ప, భాస్కర్, ప్రసాద్, జహంగీర్, విజయనిర్మల, లూర్దుజోజి, కబీర్‌దాస్, త్యాగరాజు, కొండలరావు, రాజేష్, డేవిడ్, సుందరరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

తెనాలి రోడ్డుకు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: తెనాలి– మంగళగిరి రహదారిలో ఉన్న బీటీ రోడ్డు వర్షాల కారణంగా గోతులు పడ్డాయి. ఎమ్మెల్యే ఆర్కే చొరవతో ఆర్ అండ్ బీ అధికారులు మంగళవారం నుంచి ఆ రోడ్డు మరమ్మతులు చేపట్టారు. మోరంపూడి, రేవేంద్రపాడు మధ్య బీటీ రోడ్ పూర్తిగా గోతుల మయం కావడంతో ఎమ్మెల్యే ఆర్కే, తెనాలి ఆర్ అండ్ బీ అధికారులను కలసి రోడ్డు పరిస్థితి గురించి వివరించారు. స్పందించిన అధికారులు రూ.25లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఏఈ నరసింహారావు పర్యవేక్షిస్తున్నారు.

అవినీతి రహిత పాలనే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి
- సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ఘనత జగనన్నదే



మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పక్కన కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: అవినీతి రహితంగా పాలన కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. తాడికొండలోని షిరిడి సాయి, పర్తిసాయి మందిర కల్యాణ మండపంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బత్తుల మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో చేరే విధంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని చెప్పారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను తెలుసుకున్న జగనన్న వాటిని అమలు చేసి పేద, బడుగు బలహీన వర్గాల గుండెల్లో శాశ్వత ముద్ర వేసుకున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దేశంలోనే ఏపీని నెంబర్‌వన్‌గా నిలిపిన ఘనత జగనన్నదేనని, బాబా సాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తున్నట్లు చెపన్నారు. నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ గతంలో పేదవాడికి విద్య, వైద్యం అందాలంటే ఖర్చుతో కూడుకున్న భారంగా ఉండేదని, నేడు ఏపీలో జగనన్న అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదవాడికి కార్పొరేట్‌ను మించిన వసతులతో విద్య, వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. 108, 104, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పాటు, ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా పేదవాడి ఇంటికే వైద్యులను పంపించిన ఏకైక సీఎం భారత దేశంలో జగనన్న ఒక్కడే అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు జగనన్న సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయాల మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రూ.29 లక్షల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్



ఉండవల్లి సెంటర్ నుంచి పోలకంపాడు వరకు ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్లు

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి ప్రజలకు కృష్ణాజలాలు సరఫరా చేసేందుకు రూ.29 లక్షలతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆధ్వర్యంలో కార్పొరేషన్ అధికారులు ప్రెజర్ శాండ్ ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించడానికి వచ్చిన సమయంలో ప్రజలు పాత పైపులైన్లు పూర్తిగా డస్ట్‌తో పూడుకుపోవడంతో వాటి స్థానంలో కొత్త లైన్ వేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఆ పనులను బుధవారం నుంచి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సందీప్ పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. ఉండవల్లి సెంటర్ ఓహెచ్ఆర్ దగ్గర నుంచి పోలకంపాడు అద్దేపల్లివారి వీధి వరకు దాదాపు 1.3 కి.మీ., ఉండవల్లి గుంటూరు చానల్ నుంచి ఆంజనేయస్వామి దేవస్థానం వరకు 800 మీటర్ల పొడవునా హెచ్‌డీపీఈ పైపుల నిర్మాణం చేపట్టినట్లు సందీప్ తెలిపారు. నాలుగైదు రోజుల్లో పనులు పూర్తిచేసి ఉండవల్లి సెంటర్, పోలకంపాడు, బాపనయ్య నగర్, సాయినగర్ ప్రాంతాలకు పూర్తిగా శుద్ధి చేసిన కృష్ణాజలాలు అందించనున్నట్లు వివరించారు.

ప్రభుత్వ భూముల్లో పొదలు తొలగింపు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి అద్దేపల్లి వారి వీధిలో బుధవారం కార్పొరేషన్ పొక్లెయిన్‌తో పొదలు తొలగించారు. అద్దేపల్లి వారి వీధిలో కార్పొరేషన్‌కు సంబంధించిన 13.5 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో జంగిల్ క్లియరన్స్ నిర్వహించి లెవలింగ్ చేసి పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సందీప్ తెలిపారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి రూరల్: రానున్న వేసవి కాలంలో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటిని అందించాలని కార్పొరేషన్ అధికారులు కొత్త తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. దానిలో భాగంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని వీరభద్రస్వామి గుడి వద్ద, మహాలక్ష్మి చెట్టు సెంటర్, భావనారుషి దేవస్థానం ప్రాంతాల్లో కొత్త పైపులైన్ల పనులను బుధవారం ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నట్లు వాటర్‌వర్క్స్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి తెలిపారు.

పుస్తక మహోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న చినవీరభద్రుడు తదితరులు

తాడేపల్లి రూరల్: విజయవాడ పుస్తక మహోత్సవంలో తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఒకేషనల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల సుబ్బారావు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న ఒకేషనల్ విద్యార్థులకు పుస్తక ప్రదర్శన మహోత్సవంలో రైతులకు ఉపయోగపడే ప్రాజెక్ట్ సోలార్ స్నేక్ గాడ్ స్టిక్‌ను ప్రదర్శించారని ఇది పాముకాటుకు గురవకుండా రైతులను కాపాడుతుందని అన్నారు. అలాగే సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడుల నుంచి తమల్ని తాము రక్షించుకునే విధంగా స్మార్ట్ స్కూల్ బ్యాగ్‌ను ప్రదర్శించినట్లు తెలిపారు. అదే విధంగా హైడ్రాలిక్ పొక్లెయిన్, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, స్పీడ్ బ్రేకర్ ఆధారంగా ఎలక్ట్రిసిటీని తయారు చేయడం, వంటి పరికరాలను ఒకేషనల్ విద్యార్థులు తయారుచేయడం గర్వంగా ఉందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌లను పరిశీలించిన విశ్రాంత పాఠశాల విద్యా సంచాలకులు చినవీరభద్రుడు, అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి విద్యార్థులను, వృత్తి విద్యా ఉపాధ్యాయిని వెంకటలక్ష్మిని అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వై.అపర్ణ, ఒకేషనల్ కో ఆర్డినేటర్లు వంశీ, చిన్న రెడ్డి, భుజంగరావు, మనోహర్, మధు, కమలాకర్, ఒకేషనల్ ట్రైనర్ వి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

లలిత కళలు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలు

కళాశాల విద్య ఆర్జేడీ జ్యోత్స్నకుమారి



శివరామకృష్ణశర్మ దంపతులను సత్కరిస్తున్న జ్యోత్స్నకుమారి, కుటుంబరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: లలిత కళలు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలని కళాశాల విద్య ఆర్జేడీ వి.ఆర్.జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో బుధవారం చెరువు సూర్యనారాయణమూర్తి–సీతారామమ్మ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ భారతీయ కళలు మానసిక ఆనందంతో పాటు దేశభక్తి ప్రబోధించి, సంస్కృతిపై ఎనలేని ప్రభావం చూపాయని చెప్పారు. హిందూ కాలేజీ – హైస్కూల్స్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ హరికథ వంటి కళలు అంతరించి పోకుండా సంబంధిత కళాకారులకు తగిన ప్రోత్సాహం, చేయూత నివ్వాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడినప్పుడే ప్రజలకు మన సాంస్కృతిక విలువలు తెలుస్తాయని చెప్పారు. పురస్కార గ్రహీత, హరికథా కౌముది బ్రహ్మశ్రీ ధూళిపాళ శివరామకృష్ణశర్మ భాగవతార్ మాట్లాడుతూ సినిమాల ప్రభావంతో కళలకు ఆదరణ తగ్గినప్పటికీ, హరికథ వంటి కళా రూపాలు ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాగవత, శతక పద్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన భక్తప్రహ్లాద హరికథా గానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, హిందూ కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాతృ మరణాలు అరికట్టేందుకు కృషి

డీఎంహెచ్ఓ శ్రావణ్‌బాబు



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: వైద్యులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి మాతృ మరణాలు అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ఆదేశించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన మాతృ మరణాలపై జిల్లాస్థాయి మదింపు సమావేశం నిర్వహించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఆలు, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణీ పేరు నమోదు చేసిన నాటి నుంచి క్రమం తప్పకుండా వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్య పరిస్థితిని వారికి వివరిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లి ముందస్తుగా చికిత్స చేయించడం ద్వారా మాతృ మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. స్థానిక ఆసుపత్రి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు గర్భిణులను కాన్పు నిమిత్తం తీసుకెళ్లినట్లయితే తక్షణమే ఆ విషయాన్ని సూపరింటెండెంట్‌కు తెలియజేయడం వల్ల వారు తగిన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు. జనవరిలో జిల్లాలో జరిగిన మాతృ మరణంపై సంబంధిత ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బందితో ఆయన చర్చించారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, డీఐఓ డాక్టర్ సుబ్బరాజు, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ జయంతి, డాక్టర్ సుస్మిత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రాధికారాణి, డాక్టర్ సుప్రద, డాక్టర్ యానిగ్రేస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి: హీరా చారిటుబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హీరా ఇస్లామిక్ పాఠశాలలో బుధవారం మైమదర్ క్లినిక్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. డాక్టర్ ఖాన్, డాక్టర్ ఎస్.పర్వీన్ సేవలందించారు. కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్షుడు అష్రఫ్‌ఖాన్, ట్రస్టీ సభ్యులు ఆలీబాషా ఖాన్ పాల్గొన్నారు.

19న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మంగళగిరి: నగర పరిధిలోని రామచంద్రాపురంలోని విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ కల్యాణ మహోత్సవం ఈనెల 19వ తేదీ నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచి భీమిరెడ్డి అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

18న శివాలయాల్లో లింగోద్భవ పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు శివాలయాల్లో 18 మహాశివరాత్రి, శనిత్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, లింగోద్భవ అభిషేకాలు నిర్వహించనున్నట్లు దేవదాయధర్మాదాయ శాఖ ఈఓ రామిరెడ్డి బుధవారం తెలిపారు. తక్కెళ్లపాడులోని అన్నపూర్ణ , విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారికి అర్చకులు మల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించి గ్రామస్తుల సహకారంతో శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గుండిమెడలో సిమెంట్ రోడ్డు నిర్మాణం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నూతక్కి నుంచి 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రాతూరు అండర్ పాస్ వరకు 13 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బీ అధికారులు బీటీ రోడ్ నిర్మాణ పనులను చేపట్టారు. దానిలో భాగంగా బుధవారం గుండిమెడ గ్రామంలో సిమెంట్ రోడ్ నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. రోడ్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో కొంతమంది సిమెంట్ రోడ్ నిర్మించాలంటూ బీటీ రోడ్ నిర్మాణ పనులు ఆపివేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అధికారులతో మాట్లాడి గుండిమెడ గ్రామంలో పూర్తిగా సిమెంట్ రోడ్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించడంతో ఆర్ అండ్ బీ అధికారులు నిలిపివేసిన రోడ్డు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: నిరుద్యోగులకు గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



కె. ఉషారాణిని సత్కరిస్తున్న కేఎల్‌యూ అధ్యాపక బృందం

తాడేపల్లి రూరల్: బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని విశ్రాంత ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.ఉషారాణి తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో విజ్ఞాన శాస్త్రంలో మహిళలు, బాలికల ప్రమేయం జాతీయస్థాయి సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు పలు రకాల పరిశోధనలు చేయడంలో ముందంజలో ఉన్నారని అన్నారు. భారతదేశంలో బాల్యవివాహాల దురాచారాన్ని రూపుమాపాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మహిళా అభివృద్ధి సెల్ సభ్యులు, అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ద్వారా బాలికలు విద్యలో అంచలంచెలుగా ఎదుగుతున్నారని అన్నారు. గూగుల్‌లో 60 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించిన పూజిత అందుకు ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, మహిళా ఫోరం సభ్యురాలు సత్య, సేఫ్ టీమ్ కార్యదర్శి వాణి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

మంగళగిరి: ఆటోను నిర్లక్ష్యంగా నడిపి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టి గాయపర్చిన ఘటనలో ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష బుధవారం తీర్పు చెప్పారు. ఏపీపీ ఎస్.నాగమణి కథనం ప్రకారం... 2016 నవంబరు 19వ తేదీన మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నిడమర్రుకు చెందిన వెంకటేశ్వర్లు, మంగళగిరికి చెందిన ఎం.చిన్న వందనం వడ్రంగి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలోని నిడమర్రు రైల్వే గేటు వద్దకు వచ్చే సరికి మంగళగిరి వైపు నుంచి ఎదురుగా అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడు వెంకటేశ్వర్లు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి నిడమర్రుకు చెందిన నిందితుడు కుర్రా శ్రీనివాసరావుకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ను ఏపీపీ ఎస్ నాగమణి నిర్వహించారు.

తాడేపల్లిలో డ్రోన్ పైలెట్ల శిక్షణ కేంద్రం



డ్రోన్ పైలెట్ల శిక్షణ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్న కార్మికులు

తాడేపల్లి రూరల్: వ్యవసాయ వ్యవసాయేతర, పారిశ్రామిక రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తాడేపల్లిలో అంకుర సంస్థ డ్రోగో డ్రోన్స్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంకుర సంస్థ ఎండీ యశ్వంత్ బొంతు బుధవారం మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రోన్లను ఆపరేట్ చేసే పైలెట్లకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అనుమతులు పొందిన తొలి ప్రైవేటు సంస్థ తమదేనని అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు నిండిన వారు డ్రోన్ ఆపరేటర్‌గా శిక్షణ పొందవచ్చని. డీజీసీఏ రూపొందించిన సిలబస్ ప్రకారం వారం రోజుల పాటు డ్రోగో డ్రోన్స్ శిక్షణ ఇస్తుందని వివరించారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా అనుమతులు పొందినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని యశ్వంత్ చెప్పారు. తాడేపల్లిలో త్వరలో డ్రోన్ తయారీ యూనిట్ కూడా ప్రారంభించనున్నామని, డ్రోన్స్ విడిభాగాలు తయారుచేసే ప్రణాళికను తమ సంస్థ రూపొందించిదని వెల్లడించారు.

బోరు పంపులకు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట, పెనుమా ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన బోరు పంపులకు కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది బుధవారం మరమ్మతులు చేపట్టారు. తాడేపల్లి 11వ వార్డులోని నులకపేటలో బోరుపంపు గతంలో ఉపయోగించకపోవడం వలన తుప్పు పట్టి మరమ్మతులకు గురైంది. పనికిరాని భాగాలను తొలగించి కొత్త భాగాలు ఏర్పాటు చేసి తాగునీరు వచ్చే విధంగా చేశారు. పెనుమాక కొత్తూరు ఎంపీయూపీ స్కూల్ వద్ద ఉన్న బోరు పంపునకు బెజ్జాలు పడి తాగునీరు రాకపోవడంతో ఆ బోరు పంపును తొలగించి కొత్త బోరును ఏర్పాటు చేసినట్లు ఆయా ప్రాంతాల సచివాలయాల ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఫిరంగిపురం: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.అనూరాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి ఎంపీపీ షేక్.షహేలానర్గీస్ అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు.

పొదలు తొలగింపు

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని నులకపేట రాజీవ్‌కాలనీలో ఉన్న ముస్లిం బరియల్ గ్రౌండ్ ముళ్ల చెట్లు, ఇతర పిచ్చి మొక్కలు పెరిగాయి. ఎమ్మెల్యే ఆర్కేకు స్థానికంగా ఉన్న ముస్లింలు వినతిపత్రం అందజేశారు. వెంటనే ఈ విషయాన్ని కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో బుధవారం ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో కార్పొరేషన్ పొక్లెయిన్‌తో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోవిందు తెలిపారు.

ప్రభుత్వ భూమి మెరక

తాడేపల్లి రూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న సాయినగర్‌లో ప్రభుత్వానికి చెందిన భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలం లోతట్టుగా ఉండడంతో బుధవారం మెరక చేయించారు. స్థానికంగా ఉన్న ప్రజలు పల్లపు ప్రాంతం కావడంతో మురుగు నీరు నిలబడి ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే ఆర్కేకు ఫిర్యాదు చేశారని, ఆయన సూచనల మేరకు కార్పొరేషన్ నుంచి రూ.2 లక్షలు కేటాయించి పనులు చేపట్టినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

వడ్డేశ్వరం చెరువు ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలి

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో చెరువు ప్రాంతంలో సమగ్రంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. బుధవారం ఆ ప్రాంతంలోని రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసే సమయంలో రోడ్డు పల్లంగా ఉండడడంతో వర్షపు నీరు నిలిచి దోమలు అధికంగా ప్రబలుతున్నాయని స్థానిక మహిళలు ఫిర్యాదు చేశారని, పేదలు నివసించే చెరువు ప్రాంతంలో సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం మరియదాసు, శివమ్మ, వంగూరు రత్తమ్మ, సునీత, నాగమణి పాల్గొన్నారు.

బడేపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



తాడికొండ: తాడికొండ శివారు బడేపురం గ్రామంలో తాగునీటి సమస్యపై స్పందించిన అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ 4 గంటల్లోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయించారు. బుధవారం జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ సమావేశానికి విచ్చేసిన కత్తెర సురేష్ కుమార్‌కు గ్రామానికి చెందిన మహిళలు తమ సమస్యను విన్నవించారు. కొత్తగా పైపులైన్ వేస్తున్న కారణంగా చుక్కనీరు రాక ఇబ్బంది పడుతున్నామని, సంబంధిత శాఖల అధికారులు పనులు మందకొడిగా చేస్తుండటంతో నానా తంటాలు పడుతున్నామని విన్నవించారు. స్పందించిన ఆయన తాత్కాలికంగా ఇబ్బంది తొలగించేందుకు గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని సూచించారు. 4 గంటల్లో సరఫరా ప్రారంభించారు.

రసాయన రహిత పంటలతో లాభాలు



ఫిరంగిపురం: రసాయన రహితంగా పంటలు పండించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులతో పాటు అధికంగా ఫలసాయం లభిస్తుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్ర బృందం సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని వేములూరిపాడు ఆర్బీకే కేంద్రంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పత్తి పంటలో రైతులు కొనసాగించిన వ్యవసాయ పద్ధతులపై ఆరా తీశారు. పెట్టిన పెట్టుబడి, వచ్చిన దిగుబడులు గురించి ప్రశ్నించారు. అంతర పంటగా కంది, కంద, కూరగాయల సాగు వంటి వాటిపై పెట్టుబడి, వచ్చిన నికర ఆదాయాలను గణించారు. సమావేశంలో రైతు భరోసా వీఏఏ ప్రశాంతి, పి. వ్యవసాయ సిబ్బంది వీరలక్ష్మి, ఏ మణి, ఇ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.